# తాతయ్య వీలునామాలు

తాతయ్య గదిలో రాత్రి పదయ్యేసరికి లైట్ ఆరిపోయేది- ఆయన తలుపులు వేసుకున్నాక నిద్రాసమయంలో స్తుతించే 'ఆపదామపహర్తారం' లాంటి శ్లోకాలు, ఆ తర్వాత కొన్ని ఆంజనేయస్తుతులూ వినిపించేవి... సన్నటి తలుపు సందుల్లోంచి.

రోజూ విని విని మా పిల్లలందరం ఏ శ్లోకం తర్వాత ఏ శ్లోకమో వరసగా చెప్పేసేవాళ్లం- శ్లోకాలు అవగానే... అరక్షణంలో గుర్రు మొదలయేది- ఆ శబ్దం తలుపు తోసుకుని వచ్చేస్తోందా అన్నట్లుండేది.

ఇంక మా అందరికీ నవ్వులు– ఆయన గుర్రు.. ఆయనకి నిద్రాభంగం కలిగించకపోవడం మాకు ఆశ్చర్యం వేసేది.

తాతయ్య వచ్చిన కొత్తల్లో మాకు నిద్రపట్టేది కాదు– ఆయన గుర్రు స్పెషాల్టీ అలాంటిది.

అమ్మమ్మ చనిపోయాక 'ఇంక నువ్వొక్కడవూ ఇక్కడెందుకు' అని పల్లెటూరు నుంచి బలవంతంగా తీసుకొచ్చారు– అమ్మా నాన్నా ఆయన్ని.

తాతయ్య ఇదివరకు మా అందర్నీ కూచోపెట్టి కథలూ శ్లోకాలూ చెప్పేవాడు– అమ్మమ్మ పోయాక మరీ ముభావంగా రిజర్వ్‌డ్‌గా మారిపోయాడు.

చిన్నపిల్లల్తో కాలక్షేపం చేస్తుంటే కాస్త ఛేంజ్ ఉంటుంది. రమ్మనమని బతిమాల్తే వచ్చాడుగానీ.. మౌనంగా... తను తెచ్చుకున్న పుస్తకాలు పెట్టెలు తెరిచి... ఏదో చదువుకుంటూంటాడు– ఆయన వచ్చేటప్పుడు మూడు చెక్క పెట్టెలు తెచ్చుకున్నాడు.

మూడూ వరసగా పెడితే ఓ సింగిల్ కాట్ అయిపోతుంది– తాతయ్య ఓ చిన్న దుప్పటి వేసుకుని దానిమీదే పడుకుంటాడు.

'పరుపు వేసుకో అంటే...', 'వద్దర్రా నాకు ఇదే బావుంటుంది' అని మాట దాటేస్తాడు.

తాతయ్య వచ్చాక మా పిల్లల బెడ్‌రూం ఆయనకి ఇచ్చేశాం.

ఆయన్తో పడుకోవాలని మాకు సరదా ఉన్నా ఆయనతో పడుకుంటే మేం ఎయిర్‌పోర్టులోనో, రైల్వే ప్లాట్‌ఫారమ్ మీదో పడుకున్నట్లేనని మేం హాల్లోకి మకాం మార్చేశాం.

ఎక్కువ జోకులేస్తే మా అమ్మ బాధపడుతుంది. లేదా తిడుతుంది

అని మేం ఆ 'గురక'ని ఎంజాయ్ చేస్తున్నాం– అలవాటయిపోయింది అని అనుకుంటున్నాం. నిజంగానే అలవాటైపోయింది!

రాత్రి నాలుగు గంటలకు అలారం పెట్టినట్లు గురక ఆగిపోతుంది. తాతయ్య గదిలోంచి శబ్ద తరంగాలు బదులు కాంతి తరంగాలు ప్రసారమవుతాయి.

అంతసేపణ్నుంచి రిథమిక్‌గా ఉన్న ఆ జోలపాట ఆగిపోయేటప్పటికి మాలో కొందరికి మెలుకువ వచ్చేసేది!

పైగా గదిలో వేసిన లైటు వెలుగులు తలుపు సందులోంచి చురుక్కున పొడిచేవి!

పక్కకి తిరిగి ముసుగులో తలదాచుకునే వాళ్లం.

అంత పెంద్రాళే (మా భాషలో అర్ధరాత్రే) లేచేం చేస్తున్నారీయన అని తలుపు సందులోంచి చూసేం ఓసారి.

ఆయన– ఆయన గడ్డం– లైటంద్‌షేడ్‌లో కళ్లజోడు పెట్టుకున్న వాల్మీకిలా వున్నాడు– ఏంటో రాసుకుంటున్నాడు.

తాతయ్య ఇంత తెల్లారుఝామునే లేచి ఏం రాస్తున్నాడు?

ఈ ప్రశ్నకి ఆర్నెల్ల తర్వాత మాకు జవాబు దొరికింది.

ఆరోజు తాతయ్య గదిలో గురక తర్వాత లైటు వెలిగింది.

బాగా తెల్లారాక కూడా తలుపులు తెరుచుకోలేదు.

అమ్మా నాన్నా కంగారుగా తలుపు బాదుతుంటే మాకు మెలకువ వొచ్చింది.

పక్కింటి వాళ్లు కూడా చప్పుడుకి లోపలికొచ్చారు.

అమ్మ గొంతులో దుఃఖం, కళ్లలో నీళ్లు పొంగిపోతున్నాయి.

కంగారుగా వణికిపోతోంది– తాతయ్య గురక వినబడట్లేదంటే మాకూ అనుమానమే.

తలుపు బద్దలు అయాక.. మా భయం నిజం అయింది.

తాతయ్య పెట్టి తెరచి కాయితాలు ముందేసుకుని కూచున్నాడు.

ఓ పెట్టెముందు తలవాల్చేసి ఉన్నాడు.

ఆయన చేతిలో పెన్ను బిగిసి ఉంది. మరో చేతిలోంచి కాయితాలు జారిపడ్డాయి.

ఏడుపులయ్యాక ఆ కాయితాలు చూసాక...

మాకు కన్నీళ్లలో నవ్వు పొంగింది.

దుఃఖంలో ఓదార్పు కలిగింది. తాతయ్య మాకు నవ్వులు నేర్పినట్లు అనిపించింది.

ఆ కాయితాల గురించి మీరు తెల్సుకోవాలి.

అవి తాతయ్య వీలునామాల పరంపర.

ఈ ఆర్నెలల్లో ఆయనకున్న చిన్నపాటి ఇంటికి సంబంధించి.. వారానికో వీలునామా తయారుచేశాడు.

నేను మే 31న రాసిన వీలునామా హృదయపూర్వకంగా రద్దు చేస్తున్నాను. ఆ ఇంటిని అనాథ శరణాలయానికి ఇవ్వటం కన్నా ఓల్డేజి హోంకి ఇవ్వాలని నిర్ణయించుకున్నాను.

ఇలా సాగింది.

జూన్ 30

నేను ఓల్డేజి హోమ్‌కి కాకుండా.. మా ఇంటి స్థలాన్ని మా వూరు శివాలయానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాను.

ఆగస్టు 15

స్వాతంత్ర్య సమరయోధుల విశ్రాంతి గృహంగా నా ఇంటిని వినియోగించాలని కోరుకుని ఇష్టపూర్వకంగా ఈ వీలునామా రాస్తున్నాను.

సెప్టెంబర్ 28

నేను ఇష్టపూర్వకంగా నా యింటి సర్వహక్కులూ మా అమ్మాయి సునీతకి రాస్తున్నాను.

నవంబర్ 4

నేను ముందు అనుకున్నట్లు కాకుండా మా ఇంటిని మా మనుమరాలు చిరంజీవి అపర్ణకి ఇవ్వడానికి నిర్ణయించుకున్నాను.

తాతయ్య రాసిని వీలునామాలు ఇంకా అన్నీ చదివాం.

అందులో గ్రంథాలయానికి నాలుగుసార్లు-

పాత పుస్తకాల ప్రచురణకోసం నియోగించమని నాలుగుసార్లు.

మనవళ్లు ఇద్దరికీ ఆరుసార్లు.

అది కాదు అని మనవరాలకేనని ఆఖరిసారి రాసి సంతకం చేసి డేట్ వేసి చనిపోయాడు.

తాతయ్యలో వాల్మీకిని చూసిన మేం మా అపర్ణకి ఆస్తి అంతా ఇచ్చాంగానీ- ఆ పెట్టెలు అన్నదమ్ములు ముగ్గురం దాచుకున్నాం- తాతయ్యమీద ఆపేక్షగా.

అమ్మకి ఆస్తి తాతయ్య కళ్లజోడు మాత్రం.

